
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
బుధవారం 26 ఫిబ్రవరి 2025





ప్రత్యేక అలంకరణలో గోవాడ బాలకోటేశ్వరస్వామి



విద్యుత్ వెలుగుల్లో పెదకాకాని ఆలయం



అమరావతిలో చలువ పందిళ్లు



క్వారీ ఆలయం వద్ద ఏర్పాట్లు



విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి

శివ పూజకు వేళాయే

నేడే మహా శివరాత్రి తిరునాళ్ల



కోటప్పకొండపై నందీశ్వరుడికి అభిషేకం

- విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ
- తిరునాళ్లకు త్రికూటాద్రి ముస్తాబు
- గ్రామాల నుంచి కొండకు పయనమైన విద్యుత్ ప్రభలు
- కోటయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం
- అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం
- అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు

మహా శివరాత్రికి.. శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. విద్యుత్ వెలుగుల్లో కోటప్ప కొండ సహా శైవక్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలను ప్రారంభించేందుకు అర్చకులు, అధి కారులు సకలం సిద్ధం చేశారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కోటప్పకొండ, అమరావతి, పెదకాకాని, క్వారీ, గోవాడ క్షేత్రాలు ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో అంటూ భక్తులు ప్రభలతో తిరునాళ్లకు తరలి వస్తున్నారు. శ్రీ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. ప్రభల పండుగగా పిలిచే కోటయ్య తిరునాళ్లకు 19 భారీ విద్యుత్ ప్రభలు కొండకు పయనమయ్యాయి. ప్రభలు తరలివచ్చే మార్గంలో ఎటువంటి అవాంతరాలు కలగకుండా నిర్వాహకులతో పాటు అధికారులు కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ వెలుగుల్లో కొలువుదీరే ప్రభలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరానుండటంతో సాంస్కృతిక కార్యక్ర మాలను నిర్వా హకులు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తరలిరానున్నారు. ఆయా ఆలయాల్లో స్వామి వార్ల దర్శ నాలకు, ప్రత్యేక పూజలకు తరలివచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లతో క్యూలు ఏర్పాటు చేశారు.

8



తిరునాళ్లకు గురవాయపాలెంలో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభ

ముగిసిన ప్రచారం



గుంటూరు : ఏసీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ తదితరులు

- రేపు పట్టభద్రుల పోలింగ్
- ఆరు జిల్లాల పరిధిలో 483 కేంద్రాలు
- నేడు బ్యాలెట్ బాక్సులతో కేంద్రాలకు సిబ్బంది
- ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేడు, రేపు డ్రై డే

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగిసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రచార కార్యక్రమాలు నిలిచిపోయాయి. చివరి రోజు కావడంతో మంగళవారం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. చివరి రోజైన మంగళవారం జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో ద్వారా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని గెలిపించాల్సిందిగా సందేశమిచ్చి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మరోవైపు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు వివిధ సంఘాలు, యూనియన్లను కలుసుకుని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల బరిలో ఉన్న మిగతా అభ్యర్థులు ఆటోల ద్వారా మైకు ప్రచారం నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా కూడా పలువురు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఆరు జిల్లాల పరిధిలోని 483 పోలింగ్ కేంద్రాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. కాగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి తెలిపారు.

పోలింగ్‌పై అభ్యర్థుల దృష్టి

ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులంతా పోలింగ్ రోజుపై దృష్టి సారించారు. గురువారం ఓటర్లను చైతన్యపరిచి పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చేలా చేయాలని అభ్యర్థులు, వారి అనుచరులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తం 3 లక్షల 47 వేల 116 మంది ఓటర్లున్న దృష్ట్యా పోలింగ్ శాతం ఎంత పెరిగితే అంత తమకు మేలు జరుగుతుందని కూటమి నేతలు భావిస్తున్నారు. అయితే గత ఎన్నికల్లో వేల సంఖ్యలో ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. ఈ దృష్ట్యా పోలింగ్ శాతం పెరిగినా అవి వ్యాలిడ్ ఓట్లు అయితేనే మేలు జరుగుతుంది.

సజావుగా డిస్ట్రిబ్యూషన్ జరగాలి

డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద రద్దీ లేకుండా సజావుగా ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందించాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ సరిచూసుకున్న సిబ్బందిని సురక్షితంగా రూట్ల ప్రకారం పోలింగ్ స్టేషన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరులోని ఏసీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను మంగళవారం ఆమె సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసిన్హాలతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద సైనేజ్ బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించేలా ఉండాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, మంచినీరు, శుచి శుభ్రమైన భోజనాలు అందించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు అందించారు. గురువారం ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్‌ల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరచేందుకు గదులను పరిశీలించారు. ఏసీ కాలేజీలోని ప్రేయర్ హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో కే శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలు బంద్

గుంటూరు(కార్పొరేషన్): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధ, గురువారాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రమే వైన్‌షాపులకు, బార్లకు తాళాలు వేసినట్లు తెలిపారు. ఆయా బార్లు, వైన్‌షాపుల్లో రెండు రోజుల పాటు మద్యం అమ్మకాలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో వచ్చే నెల 3న కూడా మద్యం విక్రయాలను నిషేధించినట్లు తెలిపారు.

34 రోజులు.. రూ.304 కోట్లు

- ఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారుల ముందున్న లక్ష్యం



- ఉమ్మడి జిల్లా మునిసిపాలిటీల్లో వసూళ్లు అంతంతమాత్రమే..
- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా దరిచేరని లక్ష్యం
- ఇప్పటికీ 70 శాతం దాటని వసూళ్లు..
- వినుకొండలో అత్యధికంగా... చిలకలూరిపేటలో అత్యల్పంగా..
- ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినా ప్రయోజనం శూన్యం

6

గుంటూరు, బాపట్ల
సర్కిల్స్ ఎస్‌ఈల నియామకం
- ఈఈలకు ఎస్‌ఈల ఉద్యోగోన్నతితో ఇన్‌చార్జిల పాలనకు తెర

వరుసగా రెండో ఏడాది
3 మిలియన్ టన్నుల సరుకు రవాణా

గుంటూరులో వ్యవసాయశాఖ తనిఖీ
- విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్ల పరిశీలన.. ఎగుమతులపై ఆరా

6

రెప్పపాటులో రెండు ప్రాణాలు బలి
- ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన లారీ
- తల్లీ, కూతుళ్లు దుర్మరణం.. చిద్రమైన దేహాలు
- గతంలో తండ్రి మృతి.. నేడు అమ్మ, చెల్లి
- అనాథగా మిగిలిన కుమారుడు

6

ఇన్‌చార్జ్‌ల పాలన

- ఎన్జీ రంగా వర్సిటీపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే నియామకాలు
- ఏడాదిగా అతీగతి లేని పాలకవర్గం నియామకం
- రాష్ట్ర విభజన తర్వాత మంజూరు కాని పోస్టులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైస్ చాన్సలర్, కంప్ట్రోలర్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్, కమ్యూనిటీ సైన్సు, స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్లు, రీసెర్చ్, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్లు, రిజిస్ట్రార్, కంప్ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్.. ఇలా ఒకటి కాదు రెండు కాదు కీలకమైన మొత్తం పోస్టుల్లో ఇన్‌చార్జిలే దిక్కు. ఇదీ గత కొన్నేళ్లుగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీలో జరుగుతున్న ఇన్‌చార్జిల పాలన. ఇన్‌చార్జిల పాలనతో అనేక నష్టాలు జరుగుతున్నా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడంలేదు. వర్సిటీకి చెందిన రూ.400 కోట్ల బడ్జెట్ వ్యవహారాలు ఇన్‌చార్జి కంప్ట్రోలర్ చూస్తున్నారంటే ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం యూనివర్సిటీని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ఒకటి రెండు పోస్టులు మాత్రమే వచ్చాయి. మిగిలిన వాటిని ప్రభుత్వం కొత్తగా మంజూ రు చేయాలి. వాటికి హయ్యర్ ఎడ్యుకేషన్, ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలి. ఆ తదుపరి పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులను నియమించాలి. కానీ ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీలో ఈ ఏర్పాటు లేకుండానే పనులు సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు తాత్కాలిక పద్ధతిలో చేపడుతున్న నియామకాలు వివాదాస్పదం గా మారుతున్నాయి.



ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

మూడు నెలలే...

ప్రస్తుతం ఉన్న కీలకమైన పోస్టులన్నీ మూడు నెలల తాత్కాలిక పద్ధతిపై(రీ డిప్లాయ్‌మెంట్) భర్తీ చేస్తున్నారు. వీసీకి అనుగుణంగా ఉన్న వారిని నియమించడం ఆనవాయితీగా మారింది. గవర్నర్‌తో పనిలేకుండా ఆయా పోస్టుల్లో మూడు నెలలకి ఒకసారి నియామకం చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని రకాలుగా ప్రాబల్యం ఉన్న వారికి మాత్రమే కీలక పోస్టులు దక్కుతున్నాయన్న వాదన ఉంది. గత ప్రభు త్వంలో పూర్తిగా ఒక పార్టీకి, ఒక వర్గానికి చెందిన వారికి మాత్రమే ప్రాధాన్యం దక్కిందన్న ఆరోపణలున్నాయి.

వివాదాలు..

వర్సిటీలోని కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జిలే ఉండటంపై తీవ్రవివాదం నెలకొంది. ఇప్పటికే పలు ఆరోపణలు వస్తుండటం.. కొందరు ఈ విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తుంది. రెన్యూవల్ పద్ధతికి స్వస్తి పలికి శాశ్వత నియామకాలు చేపట్టాలన్న డిమాండ్ వస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదలతో అర్హులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం ఉంది. వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషించే ఎన్జీ రంగా వర్సిటీకి ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు పాలకవర్గం లేకపోవడం గమనార్హం. ఏడాదిగా బోర్డు ఏర్పాటు కాలేదు. బోర్డు నియామకంపై త్వరితగతిన చర్యలు చేపట్టాలన్న సూచనలు వస్తున్నాయి.



ఆటోనగర్‌లోని విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేస్తున్న ఏడీ ఏ లు శ్రీనివాసరావు, సుదర్శన్ రాజు తదితరులు

ఆటోనగర్‌లో వ్యవసాయశాఖ తనిఖీ

● విత్తనాల ప్రాసెసింగ్‌యూనిట్ల పరిశీలన.. ఎగుమతులపై ఆరా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఆటోనగర్‌లో వ్యవసాయశాఖ విస్తృత తనిఖీలు నిర్వహించింది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నకిలీ విత్తనాల అడ్డా.. ఆటోనగర్' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తపై వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం స్పందించింది. జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు నేతృత్వంలో మూడు బృందాలుగా అధికారులు ఆటోనగర్‌లోని 10 విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేశారు. జూట్ ఎగుమతి అనుమతి పొందిన రెండు ప్రాసెసింగ్ యూనిట్ల అనుమతి పత్రాలను పరిశీలించి ప్రభుత్వ అనుమతి ఉన్నట్లు గుర్తించారు. నేషనల్ సీడ్ కార్పొరేషన్ యూనిట్ నుంచి 5200 క్వింటాళ్ల జూట్ విత్తనాల, తేజస్వి సీడ్స్‌కు 1072 క్వింటాళ్ల జూట్ విత్తనాల ఎగుమతికి అనుమతులు గుర్తించారు. మినుము, కంది, పెసర వంటి విత్తనాలు ప్రాసెసింగ్ చేస్తున్న యూనిట్లను పరిశీలించారు. పత్తి విత్తనాలు ప్రాసెసింగ్ ఆరంభం కాలేదని గుర్తించారు. నగరంలోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలను అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఏడీఏలు సుదర్శన్ రాజు, తోటకూర శ్రీనివాసరావు, కె.అన్నపూర్ణమ్మ, ఐ.సునీత, ఏవోలు సునీల్‌కుమార్, గౌతమ్‌ప్రసన్న, ఖడ్గం రమణకుమార్, పాల్గొన్నారు.

కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతి

దుర్గి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పుల వద్ద నాగార్జునసాగర్ కుడికాలువలో ఈతకు దిగి గల్లంతైన గుట్టపల్లి అయ్యప్ప(28) మృతదేహం నకరికల్లు మండలం గుళ్లపల్లి వద్ద మంగళవారం లభ్యమైంది. నరసరావుపేట ఎన్జీవోకాలనీకి చెందిన అయ్యప్ప ఆదివారం మండలంలోని అడిగొప్పులలో నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మ వారిని దర్శించుకొని తిరిగి వెళ్తూ మార్గమధ్యంలోని అడిగొప్పుల కుడి కాలువలో ఈతకు దిగి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

34 రోజులు.. రూ.304 కోట్లు

● ఆస్తిపన్ను వసూళ్లలో రెవెన్యూ అధికారుల ముందున్న లక్ష్యం
● ఉమ్మడి జిల్లా మునిసిపాలిటీల్లో వసూళ్లు అంతంతమాత్రమే..
● ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా దరిచేరని లక్ష్యం
● ఇప్పటికీ 70 శాతం దాటని వసూళ్లు..
● వినుకొండలో అత్యధికంగా... చిలకలూరిపేటలో అత్యల్పంగా..
● ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినా ప్రయోజనం శూన్యం



గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చి 31వ తేదీ నాటికి 2024-25 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా మున్సిపాలిటీలలో ఆస్తిపన్ను వసూలుకి ఇక కేవలం 34 రోజులు వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటివరకు రూ.202 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఇంకా రూ.304 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ప్రతి రోజు రూ 8.90 కోట్ల వసూలు చేస్తేనే 34 రోజుల్లో మొత్తం ఆస్తి పన్ను వసూలు సాధ్యమవుతుంది. లేకుంటే ఈ ఆర్థిక ఏడాది లక్ష్యం నెరవేరనట్లే అవుతుంది.

పన్ను వసూళ్లలో చతికిలపడ్డ యంత్రాంగం..

ఆస్తిపన్ను వసూళ్లలో మున్సిపాలిటీలలోని రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా సతికలపడింది. పన్ను వసూళ్లకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి, కమిషనర్లు సైతం రంగంలోకి దిగినప్పటికీ ఆశించిన మేరకు వసూలు జరగటం లేదు. ప్రభుత్వ ప్రైవేటు బకాయిలను వసూలు చేసేందుకు ప్రతి ఏడాది మార్చిలో మాత్రమే అధికారులు హడావుడి చేస్తుంటారు. అంతకుముందు కాలంలో వసూళ్లపై దృష్టి కేంద్రీకరణ ఉండదు. నామమాత్రంగానే పని చేస్తుంటారు. మున్సిపాలిటీల్లో పన్ను బకాయిలు పేరుకు పోవడానికి కేవలం ఆయా మున్సిపాలిటీలలోని రెవెన్యూ అధికారుల బాధ్యతా రాహిత్యమే నిదర్శనంగా నిలుస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న మున్సిపాలిటీల సంఖ్య	:	14
14 మున్సిపాలిటీలలో ఉన్న మొత్తం అసెస్మెంట్ నెంబర్ల సంఖ్య	:	5,37,538.
మున్సిపాలిటీలలో ఉన్న ఆస్తిపన్ను డిమాండ్	:	రూ.506,40,62,131.
ఇప్పటివరకు మున్సిపాలిటీలలో వసూళ్లు చేసిన ఆస్తి పన్ను	:	రూ. 202,40,45,840.
14 మున్సిపాలిటీలలో మిగిలి ఉన్న బ్యాలెన్స్ అమౌంట్ మొత్తం	:	రూ.304,00,16,291

వినుకొండలో అత్యధికంగా వసూళ్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 మున్సిపాలిటీలలో వినుకొండ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లు అత్యధికంగా జరిగాయి. ఆ మున్సిపాలిటీలో మొత్తం 15,730 అసెస్మెంట్ నెంబర్లు ఉండగా, అందులో రూ.6.30 కోట్లు ఆస్తిపన్ను డిమాండ్ ఉంది. దీనిలో రూ.5 కోట్లు వసూలు చేశారు. ఇక కేవలం రూ.1.29 కోట్లు పెండింగ్ ఉంది. చిలకలూరిపేట మున్సిపాలిటీ అత్యల్పంగా పన్ను వసూలు జరిగాయి. మొత్తం అసెస్మెంట్ నెంబర్లు 32,622 కాగా, అందులో ఆస్తిపన్ను డిమాండ్ రూ.22.39 కోట్లు ఉంది. దీనిలో కేవలం రూ.6.40 కోట్లు మాత్రం వసూలు చేశారు. ఇంకా రూ.15.99 కోట్లు బకాయి ఉంది. మిగిలిన 12 మున్సిపాలిటీలలోనూ వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 14 మున్సిపాలిటీలలో ఆస్తిపన్ను వసూలు సగటున 70 శాతం కూడా దాటలేదు. మాచర్ల, నరసరావుపేట మున్సిపాలిటీలలో 42 శాతం, బాపట్లలో 42 శాతం, రేపల్లెలో 56.52 శాతం, పొన్నూరులో 56.93 శాతం, తెనాలిలో 51.53 శాతం, దాచేపల్లిలో 56.53 శాతం, గురజాలలో 55.47 శాతం, పిడుగురాళ్లలో 59.72 శాతం, సత్తెనపల్లిలో 35.19 శాతం మాత్రమే వసూలు అయ్యాయి.

గుంటూరులో కేవలం 33 శాతం మాత్రమే..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీలు కార్పొరేషన్ నగరాలుగా ఉన్నాయి. అందులో గుంటూరులో ఇప్పటివరకు కేవలం 33.31 శాతం వసూలు మాత్రమే ఉంది. వాస్తవానికి జీఎంసీ పరిధిలో పెద్ద ఎత్తున రెవెన్యూ సిబ్బంది వివిధ కేటగిరీలలో పనిచేస్తున్నారు. అయినప్పటికీ వసూళ్లు అధ్వానంగా ఉన్నాయి. మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో 66.93 వసూళ్లయ్యాయి. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో మాత్రం ఆశించిన మేరకు జరగటం లేదనేది వాస్తవం.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు, పక్కన ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహమద్, జనసేన, బీజేపీ నేతలు

పట్టభద్రులారా.. ప్రగతికి ఓటెయ్యండి !

● కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): విజ్ఞతతో ఆలోచించి ప్రగతికి ఓటెయ్యాలని పట్టభద్రులకు గుంటూరు-కృష్ణా ఉమ్మడిజిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజ్ఞప్తి చేశారు. గుంటూరు, లక్ష్మీపురంలో ఆయన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుస్థిర పాలనకు మద్దతు ఇవ్వాలని కోరారు. 33 నియోజకవర్గాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నానని, ఆ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రం సంక్షేమ బాట పడుతుందని ఈ సమయంలో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశ్నించే గొంతుకలు సరైన సమయంలో మూగబోతుంటాయని, నామమాత్రపు ఉద్యమాలతో ఫలితాలేవీ రావని విమర్శించారు. సారవంతమైన భూములు, పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పించే ఈ ప్రాంతాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు. ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహమద్‌లు మాట్లాడుతూ 40ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కల్గిన ఆలపాటిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు సమర్థతతో ఎనిమిది నెలల కాలంలోనే ప్రజల తలసరి ఆదాయం పెరిగిందని, ఉపాధి అవకాశాలు మెరుగైయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రగతి సాధించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ, జనసేన గుంటూరుజిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరపతిరావు, గాదె వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణస్వామి, వేదికపై డాక్టర్ కొల్లి శారద

ఘనంగా శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవం

● ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు మాజీ మేయర్ డాక్టర్ కొల్లి శారద

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రేష్ఠ హాస్పిటల్స్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం గుంటూరు నగరంలోని హాస్పిటల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో పాటు గత ఏడాదిలో ఆస్పత్రిలో చికిత్సలు పొందిన రోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు నగర మాజీ మేయర్ డాక్టర్ కొల్లి శారద మాట్లాడుతూ అమెరికా, లండన్ వంటి దేశాల్లోని ఆస్పత్రులకు ఏ మాత్రం తీసిపోకుండా శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక చికిత్సలు ఉన్నాయన్నారు. రోగులకు ఉత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నారని వైద్యులను అభినందించారు. శ్రేష్ఠ హాస్పిటల్లో చికిత్స పొందిన వీ రామ చంద్రరాజు మాట్లాడుతూ ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో హెర్నియా ఆపరేషన్ కోసం శ్రేష్ఠ హాస్పిటల్స్‌కు వచ్చానని, ఇక్కడ అధునాతన చికిత్సలతో త్వరగా కోలుకున్నానని, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది ఎంతో ఆప్యాయతగా చూసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే పరెపాటి సురేష్, పురుషోత్తం, బాస్కరరావు తదితరులు మాట్లాడతూ వారు ఆస్పత్రిలో పొందిన వైద్యసేవలను వివరిస్తూ వైద్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రేష్ఠ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ వై లక్ష్మణస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున పాల్గొన్నారు.

రెప్పపాటులో రెండు ప్రాణాలు బలి

● ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ
● తల్లీ, కూతుళ్లు దుర్మరణం.. ఛిద్రమైన దేహాలు
● గతంలో తండ్రి మృతి.. నేడు అమ్మ, చెల్లి..
● అనాథగా మిగిలిన కుమారుడు

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : లారీ డ్రైవరు నిర్లక్ష్యం రెండు ప్రాణాలను బలి తీసుకుంది. గుంటూరు అమరావతి రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంట్ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరంలోని రాజీవ్‌గాంధీనగర్ 6/5కి చెందిన వింజమూరి పుల్లయ్య, నాగమణి(45) దంపతులకు కుమారుడు గోపీచంద్ (24), కుమార్తె చరణ్య(14) సంతానం ఉన్నారు. పుల్లయ్య అనారోగ్యంతో 2014లో మృతిచెందాడు. అప్పటినుంచి నాగమణి టైలరింగ్ చేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. గోపీచంద్ బీటెక్ పూర్తిచేసి విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు చరణ్య తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరికి అడవి తక్కెళ్ళపాడులో టిడ్కో ఇల్లు ఉంది. గోపీచంద్ 24న రాత్రి విజయవాడలో పని ముగించుకుని అడవి తక్కెళ్ళపాడులోని టిడ్కో నివాసానికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 6 గంటలకు తల్లి నాగమణి, కూతురు చరణ్యలు రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఇంటి నుంచి బయలుదేరి గోపీచంద్‌ను కలిసేందుకు స్కూటీపై అడవి తక్కెళ్ళపాడులోని టిడ్కో నివాసానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. అమరావతి రోడ్డు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు రెడ్డిపాలెం వెళ్లే వైపు యూటర్న్ తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా ఆ సమయంలో నగరాలు వైపు నుంచి అమరావతి వైపు అతివేగంగా వచ్చిన లారీ వారి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. నాగమణి, చరణ్యలు రోడ్డుపై పడ్డారు. వారి మీదుగా లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న నల్లపాడుసీఐ వంశీధర్, ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను గుంటూరు జీజీహెచ్‌కి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గతంలో తండ్రి, ఇప్పుడు తల్లి,చెల్లి మృతి చెంద టంతో కుమారుడు గోపీచంద్ ఒంటరి వాడయ్యాడు.



అవార్డును అందుకుంటున్న భాష్యం సాకేతరామ్

భాష్యం బ్లూమ్స్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ 2024-25 అవార్డు

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్-ఎంపవరింగ్ ఇండియా 3వ ఎడిషన్ ప్రకటించిన ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున భాష్యంబ్లూమ్స్ పాఠశాల సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డును కైవసం చేసుకున్నట్లు భాష్యం విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తెలిపారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దీపక్ వర్మ పాల్గొని అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించేందుకు భాష్యం బ్లూమ్స్ నిర్విరామంగా కృషిచేస్తుందని సాకేత్‌రామ్ అన్నారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి, అకడమిక్ కౌన్సిల్ అడ్వైజర్‌రాజా, బ్లూమ్స్ ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణిలు పాల్గొన్నారు.

వరుసగా రెండో ఏడాది

3 మిలియన్ టన్నుల సరుకు రవాణ

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరుసగా రెండో ఏడాది కూడా 3 మిలియన్ టన్నుల సరుకును గుంటూరు రైల్వే డివిజన్ నుంచి రవాణ చేసినట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది ఈ మైలురాయిని మార్చి 2న సాధించగా ఈ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీకే సాధించామన్నారు. పటిష్టమైన ప్రణాళిక, సిబ్బంది అంకిత భావం, టీంవర్కుతోనే ఈ ఘనత సాధ్యమైందన్నారు. కమర్షియల్, ఆపరేటింగ్ విభాగాల అధికారులు ఎం దినేష్‌కుమార్ (సీనియర్ డీవోఎం), సీహెచ్ ప్రదీప్‌కుమార్(సీనియర్ డీసీఎం) లను అభినందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరికొన్ని విజయాలను డివిజన్ సాధించిందని తెలిపారు. వాటిల్లో గత ఏడాదితో పోలిస్తే డివిజన్‌లో రైళ్లు, గూడ్స్‌ల వేగం 20 శాతం పెరిగిందన్నారు. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రాంలో 95.91 శాతం బ్లాక్‌లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు డివిజన్ మొత్తం 100 లాంగ్ హాల్స్(పొడవాటి గూడ్స్ రైళ్లు) ఏర్పడ్డాయన్నారు. ఈ ఏడాదిలో రైళ్ల సమయపాలన 88.59 శాతంగా నమోదైందన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బొల్లాపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగచింతలపాలెం గ్రామానికి చెందిన రైతు పీ.నాగేశ్వరరావు(48) విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. నాగేశ్వరరావు పొగాకు చెక్కులను ట్రాక్టర్‌లో లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలానికిచేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య, పిల్లలు రోదిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టించింది.

గుంటూరు, బాపట్ల సర్కిల్స్ ఎస్ఈల నియామకం

● ఈఈలకు ఎస్ఈల ఉద్యోగోన్నతితో ఇన్‌చార్జిల పాలనకు తెర...

గుంటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో గుంటూరు, బాపట్ల సర్కిల్స్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌లుగా కొనసాగుతున్న కేవీఎల్ఎన్ మూర్తి, జి.ఆంజనేయులుతో పాటు ఒంగోలు సర్కిల్‌కు కె.వెంకటేశ్వర్లును పూర్తిస్థాయి ఆపరేషన్ ఎస్ఈలుగా నియమిస్తూ సంస్థ జీఎండీ ఐకేవీ భాస్కర్ మంగళవారం రాత్రి నియామకపు ఉత్తర్వులు విడుదల చేశారు. కేవీఎల్ఎన్ మూర్తిని గుంటూరు సర్కిల్‌కు, జీ ఆంజనేయులని బాపట్ల సర్కిల్‌కు, కె.వెంకటేశ్వర్లును ఒంగోలు సర్కిల్‌కు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. ఈనెల 22న ఈఈలకు ఎస్ఈలుగా ఉద్యోగోన్నతి కల్పించటంతో ఆ జాబితాలో ఉన్న కేవీఎల్ఎన్ మూర్తి, అంజనేయులు, కె వెంకటేశ్వర్లు ఎస్ఈలుగా నియామకం పొందారు. ఇక ఎస్ఈలుగా ఉద్యోగోన్నతి పొందిన జాబితాలో ఉన్న గుంటూరు టౌన్-2 ఈఈగా వ్యవహరిస్తున్న సీహెచ్ రమేష్, ఎం.శ్రీనివాసరావు (గుంటూరు కన్‌స్ట్రక్షన్స్)ను విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయానికి ఎస్ఈలుగా బదిలీ చేశారు. గతంలో గుంటూరు టెక్నికల్ ఈఈగా, ప్రస్తుతం పల్నాడు ఎమ్ఆర్‌టీ సెక్షన్ ఈఈగా వ్యవహరిస్తున్న జె శ్రీనివాసులరెడ్డిని కూడా విజయవాడ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు హసిష్



తాడేపల్లిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లో చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 24 నుంచి 30 వరకు జరిగే అంతర్జాతీయ స్కేటింగ్‌పోటీలకు మన దేశం తరఫున గుంటూరుజిల్లా తాడేపల్లి డోలాస్‌నగర్‌కు చెందిన మెరుగుపాల హసిష్ ఎంపికయ్యారు. ఫెడరేషన్ అధ్యక్షుడు లీయూహూ - త్సాయ్ ఈ మేరకు ఉత్తర్వులు పంపారు. హసిష్ ఆర్టిస్ట్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీస్టయిల్ ఇన్‌లైన్, సోలోడాన్స్ పోటీల్లో తలపడతాడు. గత ఏడాది డిసెంబరులో తమిళనాడులోని పొలాచ్చిలో రోలింగ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమస్థానంతో బంగారు పతకం సాధించారు. ఆ అర్హతతోనే తైవాన్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కోచ్ పి.సత్యనారాయణ, చిట్టిబాబు, ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ కార్యదర్శి పి.థామస్, గుంటూరు రోలర్ స్కేటింగ్ అధ్యక్ష, కార్యదర్శులు సి.నీలిమ, పి.శ్రీకాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	78, 85, 95
చికెన్ విత్ స్కిన్	150.00
చికెన్ స్కిన్ లెస్	160.00

1,26,285 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,19,894 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,26,285 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,478 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	14000
నంబరు. 5	10500	14000
273	10000	13000
341	10000	14300
4884	9500	13000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11500	13000
బ్యాడిగి 355	10000	14000
సింజెంటా బ్యాడిగి 5531	10000	12500
ఎన్ఎస్ 250 బుల్లెట్	--	--
దేవనూరు డీలక్స్	11500	13500
ఆర్మూరు	10000	11500
తాలుకాయలు	5000	7500



కలెక్టర్‌తో ప్రభుత్వ గెజిటెడ్ నేతల భేటీ

బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గెజిటెడ్ అధికారుల సమస్యలు పరిష్కరించటానికి చొరవ చూపాలని ప్రభుత్వ గెజిటెడ్ అధికారుల సంఘ రాష్ట్రాధ్యక్షులు వినుకొండ రాజారావు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ జె.వెంకటుమురళిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్‌ను సంఘం ఆధ్వర్యంలో దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం గేజిటెడ్ అధికారులు డాక్టర్ సిద్దార్ధ, వి వి సురేంద్ర, డాక్టర్ నాగేశ్వరరావు, సుమదుర వాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా చెత్త సేకరణ జరగాలి

బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన సమయంలో ప్రతి ఇంటికెళ్ళి చెత్త సేకరణ జరగాలని, సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి సూచనలు చేశారు. బాపట్ల పరిధిలోని పలువార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ జి.ప్రసాద్, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి కోర్సులతో ఉపాధి

బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వృత్తి కోర్సుల ద్వారా సంబంధిత రంగాలలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందవచ్చు అని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం అన్నారు. మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజశ్రీ, జీడీసీవో చారులత, ఒకేషనల్ కో ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భర్తీపూడిలో రిజిస్ట్రేషన్‌లు నిలుపుదల

బాపట్లరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం భర్తీపూడి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 65/2లో 1.98 ఎకరాలలో అక్రమంగా వెంచర్‌ను వేస్తున్న విషయం అధికారుల దృష్టికి పంచాయతీ సిబ్బంది తీసుకెళ్ళటంతో అట్టి యజమానులకు నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా ఈ లేఅవుట్‌లలో డిటిసిపి వారు రిజిస్ట్రేషన్‌లను నిలుపుదల చేశారు. అక్రమలేఅవుట్‌లకు దూరంగా ఉండాలని భర్తీపూడి గ్రామపంచాయతీ అధికారులు, సర్పంచ్ అమరేష్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలి ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కలెక్టర్ జె.వెంకటమురళి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. శాసన మండలి ఎన్నికల నిర్వహణపై కృష్ణా-గుంటూరు నియోజకవర్గంలోని కలెక్టర్‌లతో ఎన్నికల పరిశీలకులు కరుణ మంగళవారం వీక్షణా సమావేశాన్ని నిర్వహించారు. కృష్ణా-గుంటూరు శాసన మండలి నియోజకవర్గం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. శాసన మండలి ఎన్నికలు సజావుగా జరగటానికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బాపట్ల జిల్లా నుంచి కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సామగ్రి అన్ని కేంద్రాలకు తరలిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

మీఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని నిలపాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికలపై మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 24,493 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారన్నారు. వారంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటన జరగకుండా జిల్లా ఎస్పీ తుషార్ డూడి సమర్థంగా పోలీంగ్ బందోభస్తు ఏర్పాటు చేశారని వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ నిఘా ఉంచారని తెలిపారు. 100 మంది పోస్టర్ బ్యాలెట్ వినియోగించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాలి

వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు జలవనరులను భద్రంగా నిల్వ చేసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. జలవనరుల సంరక్షణ సరఫరాపై సంబంధితశాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా-పశ్చిమడెల్టా పరిధిలోని తాగునీటి చెరువులన్నింటిని నూరుశాతం నింపాలన్నారు. కృష్ణా, పశ్చిమ డెల్టా కాల్వల ద్వారా నీటి విడుదల గడువు మార్చి15వ తేదీతో ముగియనుందన్నారు. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 16సీపీ డబ్ల్యుఎస్ చెరువులు, 175 గ్రామాలలో ఉన్న పిడబ్ల్యుఎస్ చెరువులన్నింటిని 100 శాతం నింపాలన్నారు. అలాగే మున్సిపాలిటి పరిధిలోని చెరువులను నీటితో నింపాలన్నారు. తాగునీటి చెరువులన్ని నిండేవరకు సాగుభూములకు నీటిని తరలించరాదన్నారు. ఈసమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, కృష్ణా పశ్చిమ డెల్టా ఎస్సెస్పీ, ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కుందేరువాగు ఆక్రమణల తొలిగింపునకు చర్యలు తీసుకోవాలి

కుందేరువాగు అక్రణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో కుందేరువాగు అక్రమణలు తొలగించటానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, డ్రైనేజి అధికారులతో మంగళవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుందేరువాగు వాగుకు ఇరువైపుల ఆక్రమణలు తొలగించుటకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. వాగుపై కట్టడాలు ఉన్న యెడల వారికి నోటీసులిచ్చి ఖాళీ చేయుటకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కుందేరువాగులో ఉన్న చెట్లను తొలిగించాలని ఆయన ఆదేశించారు. ఈసమావేశంలో ఆర్డీవో గ్లోరియా, డ్రైనేజిశాఖ ఇంజనీర్ మురళీ కృష్ణ, బాపట్ల, చీరాల, చినగంజాం, వేటపాలెం తహసీల్దార్‌లు సలీమా, గోపికృష్ణ, ప్రభాకరరావు, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల గుర్తింపునకు రీసర్వే చేయాలి

ప్రభుత్వ భూములు, ఆస్తులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారులు, ఉద్యోగులపై ఉందని సీసీఎల్ఏ ముఖ్య కమిషనర్ జయలక్ష్మి తెలిపారు. రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సీసీఎల్ఏ ముఖ్యకమిషనర్ జయలక్ష్మి మంగళవారం వీక్షణ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు. ప్రభుత్వ భూములన్నిటికి పూర్తి స్థాయిలో గుర్తించటానికి రీసర్వే చేయాలని జయలక్ష్మి ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో నమోదైన దరఖాస్తుల పరిష్కారంలో జిల్లా రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచిందన్నారు. భూముల రీసర్వే తదితర రెవెన్యూ అంశాలపై కలెక్టర్‌లతో ఆమె చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ అందరూ తినండి.. అపోహలు వద్దు : కలెక్టర్

చికెన్ అందరు తినండి అపోహలు వద్దు ఎలాంటి హానీ లేదని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. చికెన్, కోడిగుడ్లు మేళా కార్యక్రమం మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్ వెంకటమురళి, డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ వేణుగోపాల్, జిల్లాఅధికారులు హాజరయ్యారు. చికెన్‌తో తయారు చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను అధికారులు తినటమే కాకుండా అందరు ధైర్యంగా తినాలని సూచించారు. చికెన్ తినటం వల్ల జిబిఎస్‌వ్యాధి సోకదని, ఎలాంటి అనారోగ్యం ఉండదన్నారు. అపోహలతో పౌల్ట్రీ వ్యాపారులకు నష్టం వాటిల్లిందని అవగాహనతో చికెన్ వినియోగించాలని ఆయన సూచించారు.

ఆలపాటికి అధిక మెజారిటీ అందించాలి

● ఎమ్మెల్యే ఆనందబాబు



వేమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు వేమూరు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీ చూపించాల్సిన అవ సరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నా రు. ఆయన మంగళవారం నియోజకవర్గంలోని వేమూరు, అమృతలూరు, కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో పర్యటించారు. కూటమి నాయకులు, బూత్ ఏజెంట్లతో చర్చించారు. వారితో మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించి బూత్‌ల వారీగా అనుసరించాల్సిన విధి విధానాలు వివరించారు. పోల్ మేనేజ్‌మెంట్ కరెక్ట్‌గా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు.

ఆలపాటి రాజా గెలుపునకు కృషి చేయాలి : జంగా


సమావేశంలో మాట్లాడుతున్న జంగా కృష్ణమూర్తి

రేపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు జంగా కృష్ణమూర్తి అన్నారు. టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్యనేతలతో ఎమ్మెల్సీ ఎన్నికలపై మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 9,045 ఓట్లు ఉన్నాయని, ఆలపాటి రాజాకు వేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు విద్యాసంస్థలలో, వెదుళ్ళపల్లి, కంకటపాలెం తదితర గ్రామాలలోని పట్టభద్రులను మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకురాలు మానం విజేత కలిసి ఆలపాటి గెలుపునకు కృషి చేయాలని కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిట్టా ప్రమీలారాణి, బొడ్డుపల్లి సాంబశివరావు, బండారి వెంకటేశ్వర్లు, ఉలిచి సురేష్, సుబ్రహ్మణ్యం రెడ్డి, యార్లగడ్డ సుబ్బారావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం వేమూరులోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగులను కలుసుకుని ఆలపాటికి ఓటు వేయాలని టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు కోరారు. నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ నాయకులు కోగంటి రాజేష్, గంటా సుధాకర్, సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలి : నామన

బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా-గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతిస్తూ వారిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ అన్నారు. బాపట్ల జనసేనపార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజా గెలుపే లక్ష్యంగా మనందరం కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండలాధ్యక్షుడు దాసరి ఏసుబాబు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్, ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సభ్యురాలు, బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్‌మెంట్ సభ్యురాలు ఆగిశెట్టి విజయమాధురి, లీగల్‌సెల్ కత్తి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి : సీపీఎం

బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మంగళవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గంగయ్య మాట్లాడుతూ జిల్లా పరిధిలోని వేమూరు, చుండూరు, అమర్తలూరు, నిజాంపట్నం, చెరుకుపల్లి, పిట్టలవానిపాలెం మండలాలలో ఎన్నికల అక్రమాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. సీఐటీయూ నాయకులు సి.హెచ్ మజుందార్, ఎం.వసంతరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాలు : ఆర్డీవో

రేపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు కృష్ణాజిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నారని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రేపల్లె పట్టణంలో ఓపెన్‌థియేటర్‌లో 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రేపల్లె రూరల్ మండలంలో పిరాట్లంకలో ఒక పోలింగ్‌కేంద్రం, అడవులదీవి, నిజాంపట్నం గ్రామాల్లో ఒక్కొక్క పోలింగ్ కేంద్రం, నగరం మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు, చెరుకుపల్లి మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఓటర్లకు పూర్తిస్థాయిలో ఓటుహక్కు వినియోగించుకునే విధంగా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పక్కా బందోబస్తు మధ్య సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 9,400 గ్రాడ్యుయేట్ ఓట్లు ఉన్నాయని తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన బాపట్ల ఆర్డీవో

బాపట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లకు కేటాయించిన సిబ్బందికి తగు సూచనలు చేసి ఏర్పాట్లను బాపట్ల ఆర్డీవో గ్లోరియా పరిశీలించారు. ఆమె వెంట బాపట్ల, పిట్టలవానిపాలెం, యద్దనపూడి తహసీల్దార్‌లు సలీమా, వెంకటేశ్వరరావు, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం


క్యూలైన్‌లను పరిశీలిస్తున్న చుండూరు సీఐ శ్రీనివాసరావు

అమృతలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అంగరంగ వైభవంగా జరిగే శైవ క్షేత్రాల్లో ఒకటైన గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తుల దర్శనానికి సన్నద్ధం చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు దేవదాయ శాఖ, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్ళు నిర్మించి, పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలకంరించారు. రైతులు పశు సంపదను తోలుకు వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కుబడులను భక్తులు చెల్లించారు. పభుత్వ, ప్రైవేటు స్థలాల్లో సుమారు 200 స్టాల్స్‌ను వ్యాపారులు ఏర్పాటు చేశారు. తెనాలి, బాపట్ల, రేపల్లె నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. ఉత్సవాల ఏర్పాట్లను పండగ ప్రత్యేక అధికారి అనుమప, ఈవో అశోక్‌కుమార్, పర్యవేక్షణ కమిటీ పావులూరి రమేష్, మండల నాగమల్లేశ్వరి, కాటం నాగేశ్వరరావు, బన్నారావూరి ఆంజనేయులు, దివి హైమా ప్రియ, రామదాసు శ్రీనివాసరావు, కొండవీటి లక్ష్మీ భ్రమరాంబ, గండికోట పోలయ్య, మోపిదేవి లక్ష్మి, అల్లూరి విజయకుమారి, అమర్తలూరి బాహూజీలు పర్యవేక్షిస్తున్నారు. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రహ్మణ, పద్మశాలీయ, శాలివాహన అన్నదాన సత్రాల్లో తిరునాళ్లకు వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రభలపై రాజకీయ పార్టీ జెండాలు ఉండరాదు : చుండూరు సీఐ

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గోవాడ మహాశివరాత్రి సందర్భంగా వచ్చే ప్రభలపై రాజకీయ పార్టీ జెండాలు ఉండటానికి వీలు లేదని చుండూరు సీఐ సీహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు అన్నారు. పోలీసు శాఖ అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే వాటిని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. వీఐపీ పార్కింగ్, బస్టాండ్, క్యూలైన్, భక్తులకు దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్‌లను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అరవపల్లి గ్రామంలో ...

రేపల్లె, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లి గ్రామంలో ఉన్న బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచారి పర్యవేక్షణలో అర్చకులు చావలి రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు ప్రారంభమయ్యాయి. మంగళవారం స్వామివారికి ధ్వజారోహణ కార్యక్రమం అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి పశువులు, గొర్రెలు, ఎడ్లు, ఆవులను తోలుకునివచ్చి గుడిచుట్టూ ప్రదక్షణలు చేయించి బాలకోటేశ్వరస్వామికి వెన్న సమర్పించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ దేవతామూర్తుల రూపాలను విద్యుత్‌దీపాలంకరణ నిర్వహించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం బాలకోటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రి లింగోద్భవకాల పూజ నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి కోరారు.


బాలకోటేశ్వరస్వామి ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

● వేమూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని శివాలయాల్లో వార్షిక ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఉత్సవాలకు సిద్ధం చేశారు. చరిత్ర ప్రసిద్ధి చెందిన చావలి, వేమూరు, జంపని, పెరవలి గ్రామాల్లోని శివాలయాలలో ఆగమ శాస్త్ర ప్రకారం విశేష కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

● చుండూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వలివేరులో 10వ శతాబ్దం నాటి శ్రీగంగా లలితాంబ సమేత శ్రీస్వయంభువేశ్వర దేవాలయంలో తిరునాళ్ల, స్వామికి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నాగలక్ష్మి తెలిపారు. బుధవారం వేకువ జామున 4 గంటలకు విఘ్నేశ్వర పూజ, మహారుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని రాత్రి 11.30 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని ఈవో తెలిపారు.

● బాపట్లరూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలంలోని అప్పికట్ల, నాగేంద్రపురం గ్రామాలలో మహాశివరాత్రి తిరునాళ్ళకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. అప్పికట్లలో ప్రసిద్ధిగాంచిన శ్రీగంగా, అన్నపూర్ణ విశాలక్షీసమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు భక్తులు నిమగ్నమయ్యారు. శివరాత్రిరోజు స్వామివారికి కళ్యాణోత్సవం, మరుసటి రోజు గురువారం స్వామికి రథోత్సవం, శుక్రవారం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహిస్తారు. అదేవిధంగా నాగేంద్రపురంలో ఉన్న నాగేంద్రస్వామి దేవాలయంలో శివరాత్రి వేడుకలను వైభవంగా ప్రతి ఏట నిర్వహిస్తున్నారు. విద్యుత్ ప్రభలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ తిరునాళ్ళను నిర్వహిస్తారు.

● కొల్లూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని కోటిపల్లి స్వయంభు సోమశేఖరస్వామి క్షేత్రం, చిలుమూరులోని ఉభయ రామలింగేశ్వర క్షేత్రాలలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఉభయ ఆలయాల్లో రాత్రి 12 గంటలకు స్వామి వారి లింగోద్భవ కాల రుద్రాభిషేకం, అనంతరం నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు గావించారు.

అన్నదానానికి సిద్ధమైన సత్రాలు


ఆర్యవైశ్య సత్రంలో అన్నదాన ఏర్పాట్లు

అమృతలూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదానం చేసేందుకు ఆయా సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాలు సిద్ధమయ్యాయి. శ్రీ బాలకోటేశ్వర కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య శ్రీ యెనిశెట్టి రంగనాయకులు శ్రేష్టి అన్నదాన సత్రంలో 62వ సంవత్సరం ఆర్యవైశ్యులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిని అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు, శిఖాకొల్లి తాండవకృష్ణ, చేబ్రోలు వెంకటేశ్వర్లు, తమ్మన సాంబశివరావు, కొమ్మూరి మురళీకృష్ణ, కొత్తమాసు రమణకుమార్, తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, చీమకుర్తి మోహనవెంకటేశ్వరరావు, కపలవాయి శ్రీనివాసరావు, నేరెళ్ళ వెంకట సుబ్బారావు, పోట్టి శ్రీధర్ పర్యవేక్షిస్తున్నారు.



● నేడే మహా శివరాత్రి తిరునాళ్ల

● విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ

● అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు

విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధి

శివపూజకు.. వేళాయె

అమరావతిలో ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి: బుధవారం మహాశివరాత్రి పర్వది నానికి అమరేశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు స్నానఘాట్ వద్ద జల్లు స్నానానికి ఏర్పాట్లు చేశారు. స్త్రీలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. క్యూల్లో ఉండే భక్తులకోసం



షామియానాలు, తాగునీటి తదితర ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత ప్రసా దాలు, పాలు, అన్నదానం చేసేందుకు పలువురు దాతలు సిద్ధమయ్యారు. స్వామివారి కల్యాణానికి మండపాన్ని సిద్ధం చేశారు. బందోబస్తు పోలీసులు మంగళవారం సాయంత్రానికి అమరావతి చేరుకున్నారు. మంగళవారం బాలచాముండిక అమ్మవారు పులి వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం పల్లకిలో బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో సునీల్‌కుమార్ వేదపండితులు, అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబైన మల్లన్న సన్నిధి

పెదకాకాని: మహాశివరాత్రికి పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలుగొందుతుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో ప్రత్యేక



క్యూలను ఏర్పాటు చేశారు. దేవస్థానం తరపున, వివిధ సంఘాలు, సంస్థల సభ్యులు ప్రత్యేకంగా భక్తులకు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఆలయంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు, భోజన సదుపాయాలను కల్పిస్తున్నారు. బుధవారం రాత్రి 11 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రెండు గంటలకు స్వామివారి గ్రామోత్సవం, ఆ తర్వాత శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఈవో,ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు.

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. భక్తుల కోసం కోటప్పకొండలో సర్వం సిద్ధం చేశారు. విద్యుత్ దీపాల అలంకరణలతో కోటప్పకొండ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కొండ ఎగు వున, దిగువున విద్యుత్ దీపాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగను న్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరపున కోటయ్యస్వామికి బుధవా రం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అభిషేక మండపం లో ప్రత్యేక అభిషేకాల కోసం ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద భక్తుల కోసం స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువన ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేసేందుకు దేవస్థానం, సేవా సంస్థల ఆధ్వర్యంలో భారీగా సిద్ధం చేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలు అందించేందుకు కొండకు తరలి వచ్చారు.

కోటప్పకొండకు 550 బస్సు సర్వీసులు

కోటప్పకొండకు ఆర్టీసీ 550 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్‌ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వీఐపీల కోసం 20 ఆర్టీసీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో 85 బస్సులు నిర్వహించనున్నారు. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను నిర్వహిస్తున్నది.

అన్నదానాలకు భారీగా ఏర్పాట్లు


కొండ దిగువన ఉన్న వివిధ సామాజిక సత్రాలలో లక్షల మందికి అన్నదానం జరగనుంది. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అన్నదానం చేసేందుకు సత్రాల నిర్వహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాలలో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ కొండ ప్రాంతంలో మద్య నిషేధం విధించింది. పది కిలో మీటర్ల వరకు మద్యం విక్రయాలను నిలిపి వేశారు.

2,500 మంది పోలీసులతో బందోబస్తు

తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేప థ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో 2,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. బందోబస్తు పర్యవేక్షణకు కొండ ఎగువున, దిగువున కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమేరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తారు. డ్రోన్‌లను కూడా వినియోగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసులకు విధులు కేటాయించారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుం డా వన్‌వే నిర్వహిస్తారు. కొండ ఎగువున, దిగువున తాత్కాలిక రూరల్



కోటప్పకొండకు ప్రభతో తరలివస్తున్న చిన్నారులు



కోటప్పకొండకు తరలివస్తున్న అవిశాయపాలెం భారీ విద్యుత్ ప్రభ

పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షిం చారు. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

19 భారీ విద్యుత్ ప్రభలు

కోటప్పకొండ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి 19 భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తున్నాయి. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభలు మంగళవారం కొండకు పయనమయ్యాయి. ప్రభల రాక నేపథ్యంలో చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఒక్కొక్క ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తులో నిర్మించారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేని వారిపాలెం, కావూరు నుంచి ఒక్కొ క్కటి, చిలకలూరిపేట మండలం పురు షోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు వస్తు న్నాయి. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి ఒక్కొక్కటి, కాకాని గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. నరసరా వుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి.

వీఐపీలకు పెద్దపీట

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్ద పీట వేస్తున్నారు. వీరి సేవలో అధికారులు తరించనున్నారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తున్నది. అయితే కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వర కు వీఐపీలకు అన్ని సేవలను ఉచితంగా అందించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. వీఐపీలకు ఉచితంగా 20 బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ సామాన్య భక్తుల నుంచి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది.



స్నాన ఘట్టం వద్ద భారీ శివ కుటుంబం విగ్రహం



శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు



శ్రీ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, చదలవాడ అరవిందబాబు, యరపతినేని నిఖిల్

ఉత్సవాలకు.. క్వారీ సిద్ధం

పొన్నూరుటౌన్(చేబ్రోలు): ప్రముఖ శైవక్షేత్రమైన వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు దేవదాయశాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గతంలో ఉన్న టిక్కెట్లు వ్యవస్థను రద్దుచేశారు. ఇప్పటికే రెండురోజులుగా ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో స్వామి దర్శనానికి పోటెత్తారు. ట్రాఫిక్ మళ్లించి రద్దీ నియంత్రణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసిన్హా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఏడు భారీ విద్యుత్ ప్రభలు ఆలయానికి చేరుకుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో ప్రభ ఎత్తు 50 అడుగుల పైగానే నిర్మించారు. పారిశుధ్య పనులకు పొన్నూరు, చేబ్రోలు, తెనాలి ప్రాంతాల్లోని పారిశుధ్య కార్మికులకు విధులు కేటాయించారు.



నారాకోడూరు గ్రామంలో రూపుదిద్దుకున్న భారీ విద్యుత్ ప్రభ



గోవాడలో విస్తృత ఏర్పాట్లు

అమృతలూరు: మహాశివరాత్రి ఉత్సవాలకు గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని. భక్తుల దర్శనానికి సిద్ధం చేశారు. మంగళవారం రైతులు పశు సంపదను తోలుకు వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కుబడులను చెల్లించారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజులు జరుగుతాయి. బాలలకు వినోదం అందించేందుకు జెయింట్ వీల్, తదితర వినోద సాధనాలు ఏర్పరిచారు. తెనాలి, బాపట్ల, రేపల్లె నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, పద్మశాలీయ, శాలివాహన అన్నదాన సత్రాల్లో భక్తులకు అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పట్టభద్రుల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ❖ క్లిష్టమైన బూత్‌ల వద్ద అదనపు బందోబస్తు
- ❖ ప్రతీ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, వెలుపల వీడియోగ్రఫీ
- ❖ 0863-2241029 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు
- ❖ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి,గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసిందన్నారు. 48 గంటల పాటు మద్యం దుకాణాలకు కూడా సీలు వేస్తామన్నారు. ఓటర్లు కచ్చితంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 ఐడీ కార్డులలో ఏదో ఒకటి తప్పక తీసుకుని పోలింగ్ బూత్‌కు వెళ్లాలన్నారు. ఐడీ కార్డుతో పాటు స్లిప్పు కూడా వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఓటర్ల సహాయం కోసం కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గుంటూరులో కంట్రోల్ రూంని ఏర్పాటు చేసి నంబరు.0863-2241029 నంబరుని ఓటర్లకు అందుబాటులో ఉంచుతామన్నారు. 3 లక్షల 47 వేల 116 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించు కునేలా స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రతీ మండలంలో అవగాహన కల్పించామన్నారు.

ఓటుపై అవగాహన అవసరం

ఓటు వేసే విధానంపై ఓటర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ అభ్యర్థికి అయితే తొలి ప్రాధాన్య ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరు పక్కన ఉన్న గడిలో 1 అని అంకె వేయాలన్నారు. ఆ తర్వాత 2, 3, 4... ఇలా 25 మంది అభ్యర్థులకు ప్రాధాన్య ఓట్లు అంకెల రూపంలో వేయవచ్చన్నారు. పోలింగ్ బూత్‌లో ఇచ్చే వంకాయ రంగు పెన్నుతోనే ప్రాధాన్య ఓటు అంకెని నమోదు చేయాల న్నారు. పోస్టల్ బ్యాలెట్లు తీసుకున్న ఉద్యోగులు మాత్రం ఏ పెన్నుతోనైనా అంకె నమోదు చేయవచ్చన్నారు. ఉద్యోగులు ఓటు వేసేందు కోసం గురువారం స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని ఎన్నికల సంఘం ప్రకటించిందని, దరఖాస్తు చేసుకుంటే తప్పక దానిని ఆమోదించాలని అన్ని కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలను ఆదేశించారు. ఆరు జిల్లాల పరిధిలో ఈ నియోజకవర్గానికి సంబంధించి 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 140 పీఎస్‌లు క్లిష్టమైనవిగా గుర్తించి అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫి, మైక్రో అబ్జర్వర్‌ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలపై ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న పరిశీలకురాలు వీ కరుణ

ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

గుంటూరు ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బుధవారం రూట్ల వారీగా పోలింగ్ సామగ్రిని సిబ్బందికి కేటాయించి బస్సులు/వాహనాల్లో తరలిస్తామని రిటర్నింగ్ అధికారి/గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి ఎస్ఎస్ఎన్ కాలేజీ నరసరావుపేట, బాపట్ల జిల్లాకు సంబంధించి రేపల్లెలోని ఏవీఆర్ డిగ్రీ కళాశాల, బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో, కృష్ణా జిల్లాలో గుడివాడ ఆర్డీవో ఆఫీసు, ఉయ్యూరు ఆర్డీవో ఆఫీసు, నోబెల్‌కాలేజీ, ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి విజయ వాడ సబ్ కలెక్టర్ ఆఫీసు, నందిగామ ఆర్డీవో ఆఫీసు, తిరువూరు జడ్పీ బాలికల పాఠశాల, ఏలూరు జిల్లాకు సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ ఆఫీసు, ఏలూరు గిరిజన భవన్‌లో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ జరుగుతుందన్నారు.

లక్ష్మణరావు ఫిర్యాదుని ఎస్పీలకు పంపించాం

తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థులలో ఒకరైన సిట్టింగ్ ఎమ్మె ల్సీ కేఎస్ లక్ష్మణరావు ఫిర్యాదు చేశారని కలెక్టర్ తెలిపారు. ఆ ఫిర్యాదుని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆరు జిల్లాల ఎస్పీలకు పంపించామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

ప్రశాంత పోలింగ్ నిర్వహించాలి

కలెక్టర్లు, ఎస్పీలకు ఎన్నికల పరిశీలకురాలి ఆదేశాలు

పట్టభద్రుల ఎన్నికల ఓటింగ్ పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని జనరల్ అబ్జర్వర్ వీ కరుణ ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆమె ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజతో కలిసి ఎన్నికల ఓటింగ్‌పై ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్జర్వర్ కరుణ మాట్లాడుతూ ఓటింగ్ సక్రమంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రాల్లో ఓటింగ్‌కు చర్యలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల వరకు 144 సెక్షన్‌ను విధించాలన్నారు. ఓటు వేయడానికి వచ్చే వీఐపీలకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్ తరలింపునకు రూట్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. కృష్ణా, బాపట్ల, పల్నాడు, ఏలూరు జిల్లాల కలెక్టర్లు బాలాజీ, మురళి, అరుణ్‌బాబు, వెట్రిసెల్వి మాట్లాడుతూ బ్యాలెట్ పేపరు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాల వారీగా వేరు చేశామన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాల ఎస్పీలు ప్రతాప్‌శివకిశోర్, గంగాధర్‌రావు, తుషార్‌డూడీ మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్‌స్టేషన్ల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.



మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు, చర్యలు తీసుకోవాలని సీఐ సుబ్బరాజు అన్నారు. మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏర్పాట్లను మంగళవారం రాత్రి సీఐ సుబ్బరాజు పరిశీలించారు. క్యూలైన్‌లు, స్నానాల ఘాట్‌లను పరిశీలించారు. క్యూలైన్‌ల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన నైపుణ్యంతో విద్యార్థులు రాణించాలి

ఎమ్మెల్యే కొండయ్య



యంగ్ సైంటిస్ట్ ఇండియా సైన్స్ మాసపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విజ్ఞాన నైపుణ్యాలపై అవగాహన పెంచుకుని చక్కగా రాణించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో యంగ్ సైంటిస్ట్ ఇండియా సైన్స్ మాసపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చీరాలకు చెందిన గీతా సర్వీస్ ట్రస్టు చైర్మన్ వలివేటి మురళీకృష్ణ దేశ వ్యాప్తంగా హైస్కూల్ విద్యార్థులకు యంగ్ సైన్స్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మురళీకృష్ణ ఇప్పటికే 25 అవార్డులు పొందడం హర్షించదగిన విషయమన్నారు. వారి వెంట పత్రిక సంపాదకుడు నందమూడి కృపాకిరణ్, చీమకుర్తి మధుసూదనరావు పాల్గొన్నారు.

చిన్నారుల భద్రత అంగన్‌వాడీలదే

చినగంజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల భద్రత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని ఎంఈవో-1 బి.అజయ్‌బాబు, ఎంఈవో-2 కోటేశ్వరరావులు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు రోజైన మంగళవారం వారు పాల్గొని మాట్లాడారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ సర్టిఫికెట్‌లను ఎంఈవో-1 అజయ్‌బాబు అందజేశారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా పిల్లల యొక్క ఐదు అభివృద్ధుల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకునేటప్పుడు బేస్ లైన్‌లో ఎలా పరీక్షించి పెట్టాలి, తరగతి అయిన తరువాత ఎండ్ లైన్ లో ఎలా పెట్టాలో, ఎసెస్‌మెంట్ కార్డును ఎలా నింపాలి అనే విషయాలపై డీఆర్‌పీలు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, వెంకటేశ్వరరావులు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్.ఎం. కుర్రా రామారావు ఓ యొక్క విలువలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్.సుమలత, కే.వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శనగలో ఎండుతెగులు నివారణ చర్యలు చేపట్టండి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : శనగలో ఎండుతెగులు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ పర్చూరు. ఏడీఏ ఎస్.మోహనరావు అన్నారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగి వారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వ్యవసాయ రాయితీలు పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రత్యేక ఐడీ నెంబర్‌ను పొందాలని ఏడీఏ సూచించారు. అనంతరం పొగాకు సాగులో వచ్చే కలుపునివారణ చర్యలు గురించి రైతులకు తెలియచేశారు. అంతేగాకుండా చౌడు భూములను జిప్సంతో శుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్.మేరమ్మ, వీఏఏ సుదర్శన్ పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్‌హోంపై కార్యదర్శులకు సూచనలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులకు వర్క్ ఫ్రమ్ హోంకు సంబంధించి డీఎల్‌డీవో సీహెచ్.విజయలక్ష్మి పలు సూచనలు చేశారు. యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అందరూ నిర్ణీత సమయంలోనే విధులకు హాజరయ్యే విధంగా చూడాలని, తప్పని సరిగా అటెండెన్స్ రిజిస్టర్ ఫాలో కావాలని, ఇంకా పలు విషయాలపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీవో యశ్వంత్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఈవో ఆర్డీ కృష్ణ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆగిన నిర్మాణాల పూర్తికి కృషి

మార్టూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు పూర్తయ్యేందుకు కృషి చేస్తానని సమగ్ర శిక్షా ఏపీసీ పీవో నాగిరెడ్డి అన్నారు. మండలంలో గత ఆరు రోజుల నుంచి మండలంలోని వలపర్ల హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కేంద్రాన్ని మంగళవారం నాగిరెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతూ వివిధ స్కూళ్లలో అదనపు తరగతులు నిర్వహణ కోసం నిర్మించిన అదనపు తరగతి గదులు భవనాలు కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వాటి నిర్మాణాలు పూర్తయ్యేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మెరుగైన పోషకాహారాలను విద్యార్థులకు తప్పనిసరిగా అందించాలన్నారు. ఆటపాటలతో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. రోజూ బడికి వచ్చేవిధంగా విద్యార్థులకు ఆసక్తి పెంచేలా కృషి చేయాలన్నారు. తరువాత హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్రాంనాయక్, ప్రేమలత, సీఆర్పీలు రమేష్, శ్రీనివాస్, తిరుపతమ పాల్గొన్నారు.



వలపర్ల హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ పీవో నాగిరెడ్డి, ఎంఈవో వస్రాంనాయక్

కోటప్పకొండకు ప్రత్యేక బస్సులు

- 45 వాహనాలు సిద్ధం
- ప్రతి 15 నిమిషాలకొకటి రాకపోక
- సుమారు రూ.15 లక్షల ఆదాయం వచ్చే అవకాశం



చీరాల డిపోలో సిద్ధంగా ఉన్న ప్రత్యేక బస్సులు

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పండుగ హడావుడి చీరాల్లో జోరందుకుంది. భక్తులు చీరాల, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కోటప్పకొండకు పెద్ద సంఖ్యలో తీరుతున్నారు. దీంతో ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని డిపో అధికారులు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పా టు చేశారు. దీంతో మంగళవారం ఉద యం నుంచి పండుగ వాతవరణం సంతరించుకుంది. భక్తులు, యువకులు పెద్ద సం ఖ్యలో కోటప్పకొండకు తరలివెళ్తున్నారు. దీంతో కొండకు వెళ్లే బస్సులన్నీ కిక్కిరిస్తున్నాయి. గతేడాది చీరాల డిపో నుంచి 45 ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేయగా, డిపోకు సుమారు రూ.10లక్షలు వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 45 ప్రత్యేక బస్సులు అం ద ు బా టు లో ఉన్నాయి. అయితే ఈ సారి సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20లక్షల మే ఆదాయం సమకూరుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి 15 నిమిషాలకో బస్సు



ఎప్పటిలాగే ఈ సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు 45 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. ప్రయాణికులకు ఎలాంట ఇబ్బంది లేకుండా ఉండేలా ప్రతి 15 నిమిషాలకో బస్సు డిపో నుంచి కొండకు బయలుదేరి వెళ్తుంది. రోజూ మాదిరిగానే టికెట్ ధరలు పెద్దవాళ్లకు రూ.100, చిన్నవాళ్లకు రూ.50 ఉంది. కోటప్పకొండ నుంచి చీరాలకు పావు గంటకో బస్సు బయలుదేరుతుంది.

- జంజనం శ్యామల, డిపో మేనేజర్

అద్దంకి నుంచి 35 బస్సులు

అద్దంకి, : మహా శివరాత్రి సందర్భంగా అద్దంకి డిపో నుంచి కోటప్పకొండకు బుధవారం 35 బస్సులు, శ్రీశైలంకు అదనంగా 2 బస్సులను నడుపుతున్నట్లు డీఎం బెల్లం రామ్మోహనరావు తెలిపారు. భక్తుల రద్దీని బట్టి ఆయా రూట్లలో అదనపు బస్సులు తిప్పనున్నట్లు తెలిపారు. అద్దంకి ప్రాంత భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చినగంజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానాల వద్ద మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే తిరునాళ్లకు వచ్చే భక్తులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శీలం రమేష్ అన్నారు. తిరునాళ్లను పురస్కరించుకొని ప్రజలు, భక్తుల సౌకర్యాల నిమిత్తం ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు మంగళవారం ఎస్‌ఐ తెలిపారు. పూలవారిపాలెం గ్రామం నుంచి 216వ నెంబరు జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు మార్గం మూసివేసి ఉంటుందని తెలిపారు. కడవకుదురు గ్రామం వైపు నుంచి వచ్చే ఆటోలు, ట్రాక్టర్లను పూలవారిపాలెం వెంకటేశ్వర కల్యాణ మండపం వద్ద పార్కింగ్ చేయాలని తెలిపారు. జాతీయ రహదారి టీ జంక్షన్ నుంచి ఆటోలు, ట్రాక్టర్లను చినగంజాం హోండా షోరుం వద్ద కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలన్నారు. సోపిరాల రైల్వే గేటు నుంచి మెలకారెడ్డి విగ్రహం వరకు ఎదురు వెళ్లకూడదని తెలిపారు. చీరాల నుంచి ఒంగోలు, ఒంగోలు నుంచి చీరాల వెళ్లే ఆర్టీసీ బస్సులను చినగంజాం లోకి అనుమతించడం లేదని తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు.

అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించం



దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చినగంజాం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసే విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. మహాశివరాత్రి సందర్భంగా సోపిరాల గ్రామంలోని రామకోటేశ్వరస్వామి, కొత్తపాలెం గ్రామంలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానాలను మంగళవారం ఆయన సందర్శించి, జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆలయాల పరిసరాలలో డెకరేషన్ లైటింగ్ ఏర్పాటు చేసే ప్రదేశాలలో, విద్యుత్ ప్రభల విద్యుత్ వైర్ల వద్దకు భక్తులు, పిల్లలు వెళ్లకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. దొంగతనాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా సాధారణ దుస్తులలో కూడా పోలీసు సిబ్బందిని నియమించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. స్థానిక పోలీసు అధికారులు, ఆలయ కమిటీసభ్యులు, ప్రాథమిక ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్ శాఖల అధికారుల సమన్వయంగా వ్యవహరిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శివాలయాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండల పరిధిలోని రామకోటేశ్వర, బాలకోటేశ్వర స్వామి దేవాలయాలకు మహాశివరాత్రి సందర్భంగా సుమారు 80 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. దానికి అనుగుణంగా చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ ఆధ్వర్యంలో 130 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక ట్రైనీ డీఎస్పీ, ముగ్గురు సీఐలు, 9 మంది ఎస్‌ఐలు ఉన్నారన్నారు. ఆలయాల పరిసరాల ప్రాంతాలలో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, రెండు డ్రోన్లను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందుస్తు చర్యలు తీసుకున్నామని, వాహనాల పార్కింగ్‌కి అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో మహా శివరాత్రి ఉత్సవాలు జరిగేలా భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. బుధవారం జరిగే మహాశివరాత్రి పండుగ సందర్భంగా తీసుకుంటున్న భద్రతా పరమైన ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. క్యూలైన్ల నిర్వహణ, బారికేడ్ల ఏర్పాట్లు, భక్తులు ఆలయాలలోకి ప్రవేశించేందుకు, బయటకు వచ్చే మార్గాలను పరిశీలించి, ఆలయ కమిటీ సభ్యులకు పలు సూచనలు అందజేశారు. దేవాలయాల్లో ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ మొయిన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్‌ఐ ఎస్.రమేష్ ఇరు దేవాలయాల కమిటీ ఛైర్మన్‌లు, సభ్యులు, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, పలు శాఖల అధికారలు పాల్గొన్నారు.

కోటప్పకొండకు తరలిన తాటివారిపాలెం విద్యుత్ ప్రభ



కోటప్పకొండకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ ప్రభ

మార్టూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటివారిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభను మంగళవారం కోటప్పకొండ తిరునాళ్లకు తీసుకువెళ్లారు. మహాశి వరాత్రి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి కోటప్పకొండలో ఏర్పాటు చేసేందుకు విద్యుత్ ప్రభను తీసుకువెళ్లారు. గ్రామంలోని ముప్పనేని ఆదిశేషయ్య కుటుంబం దాదాపుగా 50ఏళ్ల కిందట మహారాష్ట్రలోని నాగపూర్‌కు వలస వెళ్లింది. ఈ కుటుంబం మహాశివరాత్రి పండుగనాడు గ్రామం నుంచి విద్యుత్ ప్రభను ఏర్పాటుచేసి కోటప్పకొండకు తీసుకువస్తామని మొక్కుకున్నారు. కాలక్రమేణా ఆదిశేషయ్య మృతి చెందడంతో ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు ఇతర కుటుంబసభ్యులు చాలా కాలం తర్వాత సొంతూరు తాటివారిపాలెం వచ్చారు. వారు సొంత ఖర్చుతో సుమారు రూ.2లక్షల వ్యయంతో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి గ్రామంలో విద్యుత్ ప్రభ వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా సీఐ ఎం.శేషగిరిరావు పర్యవేక్షించారు. అదేవిధంగా మంగళవారం వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు ఏర్పాటుచేసిన చిన్న ప్రభను ట్రాక్టర్‌పై గ్రామంలోని అన్నివీధులలో ఊరేగించారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తరువాత విద్యుత్ ప్రభను కోటప్పకొండకు తరలించారు. గ్రామం నుంచి తొలిసారిగా కోటప్పకొండకు ప్రభ తరలివెళ్లడంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శివపూజకు.. వేళాయే

- నేడే మహా శివరాత్రి తిరునాళ్ల
- విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా కోటప్పకొండ
- త్రికోటేశ్వరస్వామి సన్నిధి ముస్తాబు
- గ్రామాల నుంచి కొండకు పయనమైన విద్యుత్ ప్రభలు
- కోటయ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఆనం
- అర్ధరాత్రి లింగోద్భవ అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభం
- అమరావతి, కాకాని, గోవాడ, క్వారీ సహా శైవక్షేత్రాల్లో భారీగా ఏర్పాట్లు

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల బుధవారం నేత్ర పర్వంగా జరగనుంది. భక్తుల కోసం కోటప్పకొండలో సర్వం సిద్ధం చేశారు. కోటప్పకొండ విద్యుత్ దీపాల అలంకరణలతో కోటప్పకొండ దేదీప్యమానంగా వెలుగొందుతోంది. కొండ ఎగువున, దిగువున విద్యుత్ దీపాలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరపున కోటయ్యస్వామికి బుధవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాల కోసం ఏర్పాట్లు చేశారు. చిలకలూరిపేట మేజర్ కాల్వ వద్ద భక్తుల కోసం స్నానఘట్టాలను ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కొండ దిగువున ప్రత్యేక షెడ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాట్లను ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేసేందుకు దేవస్థానం, సేవా సంస్థల ఆధ్వర్యంలో భారీగా సిద్ధం చేశారు. స్కౌంట్స్ అండ్ గైడ్స్ సత్యసాయి సేవా సమితి సభ్యులు సేవలు అందించేందుకు కొండకు తరలి వచ్చారు.

కోటప్పకొండకు 550 బస్సులు

కోటప్పకొండకు ఆర్టీసీ 550 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్‌ల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వీఐపీల కోసం 20 ఆర్టీసీ వాహనాలను ఏర్పాటు చేశారు. ఘాట్ రోడ్డులో 85 బస్సులు నిర్వహించనున్నారు. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను నిర్వహిస్తున్నది.

అన్నదానాలకు భారీగా ఏర్పాట్లు

కొండ దిగువున ఉన్న వివిధ సామాజిక సత్రాలలో లక్షల మందికి అన్నదానం జరగనుంది. మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అన్నదానం చేసేందుకు సత్రాల నిర్వహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాలలో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ కొండ ప్రాంతంలో మద్య నిషేధం విధించింది. పది కిలో మీటర్ల వరకు మద్యం విక్రయాలను నిలిపి వేశారు.

2,500 మందితో బందోబస్తు

తిరునాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో 2,500 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. బందోబస్తు పర్యవేక్షణకు కొండ ఎగువున, దిగువున కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమేరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తారు. డ్రోన్‌లను కూడా వినియోగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసులకు విధులు కేటాయించారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్ జామ్ కాకుండా వన్‌వే నిర్వహిస్తారు. కొండ ఎగువున, దిగువున తాత్కాలిక రూరల్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేశారు. బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ పర్యవేక్షించారు. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

19 భారీ విద్యుత్ ప్రభలు

కోటప్పకొండ తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి 19 భారీ విద్యుత్ ప్రభలు తరలివస్తున్నాయి. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభలు మంగళవారం కొండకు పయనమయ్యాయి. ప్రభల రాక నేపథ్యంలో చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఒక్కొక్క ప్రభ 90 అడుగులకు పైగా ఎత్తులో నిర్మించారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేనివారిపాలెం, కావూరు నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం, కాకాని నుంచి ఒక్కొక్కటి, కాకాని గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభ కొండకు తరలి వస్తున్నాయి. నరసరావుపేట పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రభలు కొండకు తరలివస్తున్నాయి.

వీఐపీలకు పెద్దపీట

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్ద పీట వేస్తున్నారు. వీరి సేవలో అధికారులు తరించనున్నారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తున్నది. అయితే కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలను ఉచితంగా అందించేందుకు అధికారులు భారీగా ఏర్పాట్ల చేశారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. వీఐపీలకు ఉచితం 20 బస్సులను ఏర్పాటు చేసిన ఆర్టీసీ సామాన్య భక్తులను నుంచి అధిక చార్జీలను వసూలు చేస్తున్నది.

సిబ్బంది బాధ్యతగా పనిచేయకపోతే చర్యలు

ఉపాధి పీడీ విజయలక్ష్మి



సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న పీడీ విజయలక్ష్మి

ఇంకొల్లు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయి లో స్థాయిలో సహా సిబ్బంది బాధ్యతగా పని చేయకపోతే చర్యలు తప్పవని ఉపాధి హామీ పథకం పీడీ విజయలక్ష్మి హెచ్చరించారు. మండల పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి హామీ పనులపై మండల అభివృద్ధి కార్యాలయం వద్ద 16వ విడత సామాజిక తనిఖీల ప్రజావేదిక మంగళవారం జరిగింది. మండలంలోని మొత్తం 511 పనులు 13 గ్రామాలలో పనులు జరగగా ఇటీవల సామాజిక తనిఖీ బృందం నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ప్రతిపాదనల కంటే మించి జరిగిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మస్టర్లలో ఉన్న తేడాలను గుర్తించారు. గ్రామాలలో పని ప్రదేశాలలో సదుపాయాలు సక్రమంగా లేవని ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సభలో డీవీవో శోభన్, క్యూసి సతీష్, ఎస్‌ఆర్‌పీ చిరంజీవి, నాయక్, శ్రీనివాసరావు, ఏపీవో రేణుకా, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి పూజలకు సిద్ధమైన ఆలయాలు

పర్చూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని ఆయా శివాలయాలు ముస్తాబయ్యాయి. పర్చూరులోని భీమేశ్వరస్వామి ఆలయం, చెరుకూరులోని శ్రీ ఆగస్థేశ్వర స్వామి వారి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం వేకువ జాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వాహక అధికారులు బి.నాగయ్య, డి.నాగేశ్వరావు తెలిపారు.



విద్యుత్ దీపాలతో పర్చూరులోని భీమేశ్వరస్వామి ఆలయం

దేవుడే దిక్కు





నామ్ రోడ్డులో అద్దంకి మండలంలోని చక్రాయపాలెం వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇటీవల కూడా రెండు ప్రమాదాలు జరిగాయి. దీంతో రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ సుబ్బరాజు గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతంలో దేవుళ్ల ఫొటోలు ఉండే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో గ్రామస్థుల సహకారంతో పోలీసులు నామ్ రోడ్డుకు రెండు వైపులా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఒక వైపు ఆంజనేయ స్వామి బొమ్మ, రెండో వైపు వినాయకుని బొమ్మతో ఉన్న ఫ్లెక్సీలు వెలిశాయి. గ్రామస్థులు ఆశించిన విధంగా ప్రమాదాలు తగ్గుతాయని ఆకాంక్షిద్దాం.

- అద్దంకి, (ఆంధ్రజ్యోతి)

అపరిశుభ్రంగా స్నానాల ఘాట్

- చేపల చెరువుల నుంచి వ్యర్థాలు రిజర్వాయర్ నీటిలోకి
- పేరుకు పోయిన పైనం
- మణికేశ్వరం వచ్చే భక్తులకు తప్పని కష్టాలు



గుండ్లకమ్మ రిజర్వాయర్

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి రోజు నదీ స్నానాలు చేసి శివయ్యను దర్శించుకోవాలనుకునే భక్తులకు కష్టాలు తప్పడం లేదు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద గుండ్లకమ్మ నదిలో భక్తులు స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. అయితే మణికేశ్వరం సమీపంలో ఉన్న చేపల చెరువుల నుండి వ్యర్థాలను గుండ్లకమ్మ నదిలోకి వదలడంతో ఆ వ్యర్థాలు మొత్తం నీటిపై తేలుతూ నది మలుపులో ఉన్న స్నానాల ఘాట్ వద్ద పేరుకు పోయాయి. చేపల పెంపకానికి కోళ్ల మాంసం వ్యర్థాలను వినియోగిస్తుండడంతో ఆ వ్యర్థాలను గుండ్లకమ్మ రిజర్వాయర్ లోకి వదలడంతో కలుషితంగా మారాయి. స్నానాల ఘాట్ వద్దనే కలుషితమైన నీరు నిలవడం, వ్యర్థాలు నీటి పై తేలియాడుతుండడంతో మహాశివరాత్రి రోజు మణికేశ్వరం వద్ద స్నానాలు చేసే భక్తులకు ఇబ్బందులు తప్పేటట్టు లేదు. అధికారులు స్పందించి చేపల చెరువుల వ్యర్థాలు గుండ్లకమ్మ రిజర్వాయర్ నీటిలోకి విడుదల చేయకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



మణికేశ్వరం స్నానాల ఘాట్ వద్ద నీటిపై తేలియాడుతున్న వ్యర్థాలు



డాక్టర్ నగేష్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఇంగ్లీష్‌తో పలు రంగాల్లో రాణింపు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : సమాచార మార్పిడికి, ఉద్యోగ, వ్యాపార రంగాలలో రాణించడానికి, శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధికి ఇంగ్లీష్ భాష అవసరమని దర్శి కళాశాల సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ ఏ.నగేష్ అన్నారు. మంగళవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యత కార్యక్రమం అతిథి, అధ్యాపక సదస్సు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. అనంతరం అధ్యాపకుడు డాక్టర్ నగేష్‌ను కళాశాల అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.షర్మిల రాణి, జేకేసీ మెంటర్ వినుకొండ రమేష్, వేటి ప్రసాద్, శిఖామణి, అశోక్, గంగయ్య, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కోటపాడు యూపీ పాఠశాలలో క్విజ్ పోటీలు

పంగులూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్‌కు సంబంధించిన పాఠ్యాంశంపై క్విజ్ పోటీ నిర్వహించారు. పేర్ని సుబ్బయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6,7,8 తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలో బూదవాడ, కొండమూరు, పంగులూరు పాఠశాలల జట్లు మొదటి మూడు స్థానాలు దక్కించుకున్నట్లు హెచ్ఎం వేణు తెలిపారు. మార్చి మూడవ తేదీన స్పెల్ బీ పోటీ జరుగుతుందని, ఫిబ్రవరి వరకు ఉన్న సిలబస్‌లో 6,7,8, తరగతుల విద్యార్థులకు మండల స్థాయిలో కోటపాడు యూపీ పాఠశాలలో ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధి విశ్రాంత ఇంజనీర్ పేర్ని వీరనారాయణ తెలిపారు.

ఆదర్శ న్యాయాధికారి లక్ష్మీనారాయణ



సంతాప సభలో మౌనం పాటిస్తున్న విశ్రాంత న్యాయాధికారి మురళీఅచ్యుతరావు తదితరులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, వృత్తిపట్ల అంకిత భావం ఉన్న వ్యక్తి సీనియర్ న్యాయవాది, విశ్రాంత న్యాయాధికారి చిక్కరాజు లక్ష్మీనారాయణ అని రిటైర్డ్ న్యాయాధికారి కొత్తమాసు మురళీఅచ్యుతరావు అన్నారు. అద్దంకికి చెందిన సీనియర్ న్యాయవాది, రిటైర్డ్ న్యాయాధికా చిక్కరాజు లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. ఆయన మృతి పట్ల అద్దంకి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ సంతాప సభ కోర్టు ఆవరణంలో జరిగింది. ముందుగా లక్ష్మీనారాయణ చిత్రపటానికి నివాళుల ర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత న్యాయాధికారి అచ్యుతరావుతో పాటు న్యాయవాదులు పి.ఉదయభాస్కర్, పీఎల్ఎన్ ప్రసాద్, పి. రమేష్ లక్ష్మీనారాయణతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. యువ న్యాయవాదులకు ఆదర్శమైన వ్యక్తి అంటూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సుభాష్‌బాబు, ఇంటూరి హనుమంతరావు, సలీం పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీతో సేవాభావం



ఎన్‌సీసీపై అవగాహన కల్పిస్తున్న పాండిశ్చేరి విశ్రాంత ప్రొఫెసర్ రాముడు

వేటపాలెం (చీరాల), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీపై శిక్షణ పొందడం వలన జాతీయ సమైక్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పాండిశ్చేరి అసోసియేట్ విశ్రాంత ప్రొఫెసర్, పందిళ్లపల్లి వాసి కడెం రాముడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాశాలలో జాతి నిర్మాణంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ పాత్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖరరావు, విశ్రాంత తహసీల్దార్ దోగుపర్తి సుబ్రహ్మణ్యం, జయచంద్ర, రామ బూషి, శ్రీమన్నారాయణ, మోహన్‌రావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామ సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కొప్పెరపాడు గ్రామ రెవెన్యూ అధికారి గురవయ్య, కొండాయపాలెం గ్రామానికి చెందిన నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇరువురినీ గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. ప్రమాదంలో గాయపడిన వీఆర్వో గురవయ్యను తహసీల్దార్ రవినాయక్, రెవిన్యూ సిబ్బంది పరామర్శించారు.

యువకుడి మృతదేహం లభ్యం

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన యువకుడు గుంటుపల్లి అయప్ప (28) సాగర్ కాలవలో ఈతకు దిగి కొట్టుకుపోయిన ఘటనలో యువకుడి మృతదేహం గుంటూరు జిల్లా పరిధిలో మంగళవారం లభ్యమైంది. అందిన సమాచారం మేరకు.. ముక్తేశ్వరం గ్రామానికి చెందిన గుంటుపల్లి అయప్ప అనే యువకుడు అడిగొప్పుల అమ్మవారి దర్శనానికి వెళ్లి తిగి వస్తూ మార్గమధ్యలో ఉన్న సాగర్ కాలువలో ఈతకు దిగి ఆదివారం నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. రెండు రోజుల నుంచి వారి బంధువులు యువకుడి అచూకి కోసం కాలవలో వెతకగా గుత్తికొండ వద్ద అయ్యప్ప మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టు మార్టం అనంతరం స్వగ్రామం ముక్తేశ్వరం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తామని బంధువులు తెలిపారు. అయ్యప్పకు భార్య ఉంది.

పాఠశాలకు, బీరువా, కుర్చీలు అందజేత

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలకు బీరువా, కుర్చీలను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యురాలు, హెచ్ఎం కోట అంజయ్య ఆర్థిక సహకారంతో స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు పది వేల రూపాయలు విలువ చేసే బీరువా, కుర్చీలను పాఠశాలకు అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ మురళీసుధాకరరావు, కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, కోనేటి అనీల్, నందిరెడ్డి శ్రీనివాసరావు, మురళీకృష్ణ, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



డీఎస్పీ మొయిన్‌కు జ్ఞాపికను అందిస్తున్న విద్యార్థులు

రహదారి భద్రత అందరి బాధ్యత

డీఎస్పీ మొయిన్

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రమాదాల నియంత్రణకు తమవంతు కృషి చేయాలని డీఎస్పీ ఎండి మొయిన్ అన్నారు. మంగళవారం చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రహదారి భద్రత వారోత్సవాలు అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ హాజరయి ప్రమాదాలపై మాట్లాడారు. అనంతరం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు విద్యార్థులతో కలిసి డీఎస్పీ,రూరల్ సీఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా జగదీష్, జ్యోతి స్వరూప్, ఆర్‌వి రమణమూర్తి, అన్నం శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో బోధనకు ప్రాధాన్యం



శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న ఎంఈవో రమేష్

పంగులూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలు బోధనా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విద్యాధికారి జి.వీరాంజనేయులు సూచించారు. పంగులూరులో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధనాంశాలపై చేపట్టిన మూడురోజుల శిక్షణ మంగళవారం ముగిసింది. ప్రీ స్కూల్ చిన్నారులకు కథలు, ఆట, పాటలతో బోధన సాగించి, చదువు పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. పోషకాహారం, ఆరోగ్య సంరక్షణతో పాటు అక్షర జ్ఞానం అందించి, ప్రాథమిక విద్యకు సంసిద్ధులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మజ, రిసోర్స్ పర్సన్స్ సుబ్బారావు, ప్రతాప్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్లికురవ : ఆరు రోజులుగా శిక్షణలో నేర్చుకున్న అంశాలతో చిన్నారులకు మెరుగైన విద్యా బోధన అందించాలని ఎంఈవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం విద్యావనరుల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞాజ్యోతి శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శిక్షకులు రామకృష్ణ, సురేష్, సూపర్ వైజర్ సలోమి పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి



రామకూరులో మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఆశించిందని, దాని నివారణకు రైతులు తగిన చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరు, భగవాన్‌రాజుపాలెం గ్రామాలలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్నను రైతులతో కలసి పరిశీలించారు. సాగులో ఉన్న పంటలను మార్చి 3లోగా ఈ-క్రాప్ చేయించాలన్నారు. భూ యజమానులు ఈ నెల28లోగా రైతు సేవా కేంద్రాలలో అగ్రిస్టాక్ యాప్‌లో వివరాలను నమోదు చేసి తగిన ఐడీ నెంబరు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పృథ్వీ, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : రైతులు వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని గోవాడ, చిన్నకొత్తపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్.దీప్తి, ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : రానున్న రోజుల్లో ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ప్రతి రైతూ ప్రభుత్వ ప్రత్యేక విశిష్ట ఐడీ నెంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మార్టూరు సబ్ డీవిజన్ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వేమవరం, కొప్పెరపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రెండు గ్రామాలలో రైతులు సాగు చేసిన పలు పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు. మార్చి మూడో తేదీతో రబీ సాగు ముగుస్తుందని పంటలు వేసిన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం రెండు గ్రామాలలో జరుగుతున్న ఐడీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో కుమారి, వీఏఏ వెంకటేష్, బాషా, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- జగన్‌రెడ్డి నిర్వాకంతో గాడి తప్పిన రాష్ట్ర ప్రగతి
- శాసనసభలో ఎమ్మెల్యే కొండయ్య



అసెంబ్లీలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై ఎమ్మెల్యే కొండయ్య శాసనసభలో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నియోజకవర్గంపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీలో కొండయ్య మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు సం బంధించిన సమస్యలు, సివిల్ సప్లయ్, టూరిజం వంటి సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు కొండయ్య వివరించారు. అదే సందర్భంలో జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అనుసరించిన కక్షసాధింపు, అవినీతి, అక్రమాలను కొండయ్య ఎండగట్టారు. అభివృద్ధిని విస్మరించిన జగన్ కేవలం కక్షసాధింపు రాజకీయాలను కొనాగించారన్నారు. ఆయన జిమ్మిక్కులను గ్రహించి ప్రజలు టీడీపీ కూటమికి జై కొట్టారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చీరాల పరిధిలో ఒక్క కాలువ పూడిక తీయక పోవడంతో రైతన్నలు సాగుకు ఇబ్బందులు పడినట్లు వివరించారు. కూటమి అధికారంలోకి రావడంతో వేగవంతంగా సమస్య పరిష్కరించినట్లు చెప్పారు. జగన్‌రెడ్డి హయాంలో ధాన్యం అమ్ముకున్న రైతుల కు నగదు జమకాలేద న్నారు. తల్లుల ఖాతాల్లో డబ్బులు వేస్తానని విద్యార్థులను మోసగించిన జగన్‌రెడ్డి నిర్వాకంతో ప్రస్తుతం వారు డ్రాపౌట్స్‌గా మారి జీవితాలు ప్రశ్నార్థకం అయినట్లు కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ బిల్లులు ఇవ్వక పోవడంతో రోగులకు వైద్య సేవలు అందలేదన్నారు. ఇలా అన్ని రంగాల్లోనూ జగన్‌రెడ్డి అనుస రించిన తప్పుడు విధానాలతో రాష్ట్ర అభి వృద్ధి గాడితప్పిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతూ పేదల ఆదరణ పొందుతోందని కొండయ్య తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

ఈపూరుపాలెం(చీరాల), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఈపూరుపాలెం బూదాటివారి వీధిలో వేంచేసి ఉన్న అంకమ్మతల్లి వార్షికోత్సవ తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం వరకు జరిగే ఈ మహోత్సవంలో మొదటిరోజు భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమ పూజలు చేసి అమ్మ కృపకు పాత్రులయ్యారు. అలాగే బుధవారం గ్రామోత్సవం, గురువారం పొంగళ్లసేవ, శుక్రవారం అన్నాభిషేకం ఉంటుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు మహా రుద్రాభిషేకం

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాయపాలెం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి దేవాలయం వద్ద బుధవారం సాయంత్రం మహా శివరాత్రి సందర్భంగా నాగ సాధువులచే మహా రుద్రాభిషేకం జరుగుతుందని దేవాలయ ధర్మకర్త ధూళిపాళ్ల రామగోవిందు తెలిపారు. మట్టి శివలింగాన్ని ఏర్పాటు చేసి అభిషేకం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. పట్టణంలో వాహనాలు వేగం తగ్గించేందుకు భవానీసెంటర్ లో మలుపు వద్ద రెండు వైపులా నామ్ రోడ్డు సిబ్బంది ద్వారా స్పీడ్ బ్రేకర్లు మంగళవారం వేయించారు. స్పీడు బ్రేకర్ల ఏర్పాటును సీఐ సుబ్బరాజు పరిశీలించారు. ఇప్పటికే ప్రధాన కూడలి ప్రాంతాలలో పెయింటింగ్‌తో జీబ్రా క్రాసింగ్ లైన్స్ వేయించారు. అదే సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు.



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపీకృష్ణ, డీటీ అర్జున్

నిల్వల్లో వ్యత్యాసాలుంటే కేసులు

చీరాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ రైస్, ఇతర సరుకుల్లో వ్యత్యాసాలు ఉంటే కేసులతో పాటు కఠిన చర్యలు తప్పవని, వీఆర్వోలు విధిగా దుకాణాలపై నిఘా ఉంచి తనిఖీలు చేపట్టాలని తహసీల్దార్ గోపీకృష్ణ అన్నారు. మంగళవారం కార్యాలయం సమావేశం హాలులో రేషన్ డీలర్లు, ఎండీఎం ఆపరేటర్‌లు, వీఆర్వోలకు వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడా అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీటీ అర్జున్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లు తనిఖీ



బల్లికురవలో సీసీ రోడ్లను తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

బల్లికురవ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం నిధులతో ఇటీవల నిర్మాణం చేసిన సిమెంట్ రోడ్లను, మురికి కాలవలను మంగళవారం ఒంగోలు క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఎంవీ శ్యాంప్రసాద్ బృందం తనిఖీలు చేశారు. బల్లికలురవ మండలం కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, కోటవారిపాలెం, బల్లికురవ, అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాలలో చేసిన 9 వర్కులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు మిషన్ల ద్వారా తనిఖీలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు రోడ్లలో క్వాలిటీ లేకుంటే బిల్లులు నిలుపుదల చేస్తామన్నారు. రోడ్ల నిర్మాణం చేసే కాంట్రాక్టర్లు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ తనిఖీలో క్వాలిటీ ఏఈఈ సీహెచ్ శ్రీనివాస్, పీఆర్ ఏఈ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వసూళ్లపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్‌లతో వచ్చే డబ్బు దండుకునేందుకు అధికారులు, సిబ్బంది పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో మంగళవారం దొంగ మస్టర్‌లు... మీ ఇష్టం కథనం ప్రచురితమైంది. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది తో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆం ధ్రజ్యోతి కథనాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అద్దంకి నియోజకవర్గంలోని సంతమాగులూరు, బల్లికురవ మండలాల్లో ఉపాధిపనుల్లో అవినీతిపై విజిలెన్స్ అధికారి, అడిట్ బృందంతో విచారణ చేయిస్తామని తెలిపారు. దీంతో ఇప్పటికే అద్దంకి నియోజకవర్గంలో ఉపాధిలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకొని ఉం డటం, ఇటీవల బల్లికురవలో జరిగిన ప్రజా వేదికలో కూడా పలు అవినీతి బాగోతాలు వెలుగులోకి రావడంతో ప్రస్తుతం జరిగే పనులతో పాటు గతంలో జరిగిన పనులలో మరి కొన్ని కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉండడంలో అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైనట్లు తెలుస్తుంది.